
గద్దెల వద్ద పూలతో అలంకరించిన సమ్మక్క ప్రతిమ


జంపన్నను గద్దెపైకి ప్రతిష్ఠిస్తున్న పూజారులు

# వీర వనితలకు వందనం..

## నేటి నుంచే మేడారం మహాజాతర

- నాలుగు రోజులు జ(వ)న మహోత్సవం
- సమ్మక్క, సారక్కకు ప్రణమిల్లనున్న ప్రపంచం
- నేడు కన్నెపల్లి కల్పవల్లి సారలమ్మ రాక
- మేడారం బాటలో గోవిందరాజు, పగిడిద్దరాజు
- 'సంపెంగ'కు చేరుకున్న జంపన్న
- ఇప్పటికే తల్లుల చెంతకు భక్తజన ప్రవాహం
- కనుచూపు మేర వెలసిన గుడారాలు

తాడ్వాయి, ఫిబ్రవరి 20 : తనువెల్లా భక్తితో తల్లులను కొలిచే తరుణం ఆసన్నమైంది. రెండేళ్లుగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సంబురం రానేవచ్చింది. అడవి ఒడిలో మహాజాతరకు చెట్టూ పుట్టా ముస్తాబైంది. వీరగడ్డ మేడారంలో నేటి సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మ రాకతో అపూర్వ.. అత్యద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. మరునాడు సమ్మక్క రాక ఆద్యంతం ఉద్విగ్నభరితంగా కొనసాగనుండగా ప్రపంచమంతా మేడారంవైపే ప్రణమిల్లనుంది. కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి బయల్దేరిన పగిడిద్దరాజు నేటి సాయంత్రం మేడారం చేరుకోనుండగా అమ్మవార్ల దర్శనానికి జన ప్రవాహం ఇప్పటికే పోటెత్తుతున్నది.

నేటి నుంచి 24వరకు మేడారం మహా జాతర కొనసాగనుంది. కన్నెపల్లి నుంచి సారలమ్మ బుధవారం సాయంత్రం మేడారంలోని గద్దెపైకి చేరుతుంది. మధ్యాహ్నం కన్నెపల్లి నుంచి సారలమ్మ వడ్డెలు మేడారంలోని గద్దెలకు వచ్చి అక్కడ ముగ్గులు వేసి మళ్లీ కన్నెపల్లిలోని పూజా మందిరానికి చేరుకుంటారు. అక్కడ రెండు గంటల పాటు అత్యంత గోప్యంగా పూజలు చేసి సారలమ్మను తీసుకువస్తారు. కడుపు పండాలని కోరుకునేవారు, దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న వేలాది మంది భక్తులు తడి బట్టలతో గుడి ఎదుట సాష్టాంగ నమస్కారాలతో వరం పడతారు. దేవత రూపాన్ని చేతపట్టుకుని గుడి బయటకు వచ్చిన పూజారులు వరం పడుతున్న వారి పైనుంచి నడిచి వెళ్తారు. కొండాయి నుంచి గోవిందరాజులు, పూనుగొండ్ల నుంచి బయల్దేరిన పగిడిద్దరాజు నేటి సాయంత్రం మేడారం చేరుకుంటారు. రాత్రి 7 గంటలకల్లా ఈ ముగ్గురూ గద్దెలపై కొలువుదీరనున్నారు. గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో సమ్మక్కను గద్దెలపైకి అత్యంత నియమనిష్టలతో తీసుకొస్తారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శనం కోసం భక్తులు రాత్రింబవళ్లు తేడా లేకుండా బారులు తీరనున్నారు. ఎత్తుబంగారం మొక్కులు చెల్లించనున్నారు. జాతర చివరి రోజైన శనివారం తల్లుల వనప్రవేశంతో జాతర ముగియనుంది. మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపడుతున్నారు. మంగళవారం సాయంత్రం కన్నెపల్లి పరిసర ప్రాంతాలను పరిశీలించారు.



గట్టమ్మ వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

### కిక్కిరిసిన పరిసరాలు

మేడారం జాతరలో రాష్ట్ర ప్రభుత్వం రూ.110కోట్లతో ఏర్పాట్లు చేసింది. ఆర్టీసీ ఆధ్వర్యంలో సుమారు 6వేల బస్సులు నడుపుతున్నారు. 10వేల మంది పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. మొత్తంగా దాదాపు కోటీ 50లక్షల మందికి పైగా భక్తులు తల్లుల దర్శనానికి వస్తారని అధికార యంత్రాంగం అంచనా వేసింది. మంగళవారం సాయంత్రం నుంచి భక్తుల రాక పెరిగింది. జంపన్నవాగు, చిలకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్, కొంగలమడుగు ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. పొలాల్లో గుడారాలు వెలిశాయి. కొందరు భక్తులు తమ వాహనాలనే ఆవాసాలుగా మార్చుకొని అమ్మల దర్శనం కోసం ఎదురు చూస్తున్నారు. జంపన్నవాగులో భక్తులు పుణ్యస్నానాలు చేస్తూ తరించిపోతున్నారు. జాతర విశేషాలను చూసేందుకు అధికారులు ఎల్ఈడీ స్క్రీన్లు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేశారు.


మేడారం జాతరకు వాహనాల్లో వస్తున్న భక్తులు


కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో పూజలు చేస్తున్న పూజారులు

### గద్దెల ప్రాంగణం ముస్తాబు

ములుగు రూరల్ : గద్దెల వద్ద సమ్మక్క తల్లి ముఖచిత్రాన్ని పూలతో అలంకరించారు. భక్తులు కానుకలు సమర్పించేందుకు హుండీలు ఏర్పాటు చేశారు. కన్నెపల్లిలో సారలమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. గద్దెల ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మవార్ల ప్రాంగణం, గద్దెల చుట్టూ ఉన్న సాలహారం, ఆర్చి గేట్లను రకరకాల పూలతో అలంకరిస్తున్నారు.



# మేడారానికి పగిడిద్దరాజు పయనం

- పూనుగొండ్లలో పెనక వంశస్తుల ప్రత్యేక పూజలు
- పడిగెతో కాలినడకన 70 కి.మీ ప్రయాణం
- ఊరుదాటే వరకు సాగనంపిన మహిళలు
- నేటి సాయంత్రం గద్దెకు చేరనున్న సమ్మక్క భర్త

గంగారం, ఫిబ్రవరి 20 : మేడారం మహాజాతర ఘడియలు సమీపించాయి. అపురూప ఘట్టానికి మరికొన్ని గంటలే మిగిలి ఉన్నాయి. వనం బాట పట్టిన భక్తులు తల్లుల రాక కోసం తనువెల్లా కన్నులై ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం జాతరలో కొలువుదీరేందుకు గిరిజన సంప్రదాయాల నడుమ మంగళవారం బయల్దేరారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండల పరిధిలోని పూనుగొండ్ల నుంచి వడ్డెలు పగిడిద్దరాజు పడిగెతో అటవీ మార్గాన మేడారం బాటపట్టారు. రెండేళ్లకోసారి జరిగే మహాజాతరకు పూనుగొండ్ల పెనక వంశస్తులు పగిడిద్దరాజును వరుడిగా అలంకరించి మేడారం తరలించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈక్రమంలో మంగళవారం పెనక వెంకటేశ్వర్లు ఇంట్లో పసుపు, కుంకుమతో పూజలు చేసి అక్కడి నుంచి డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల నడుమ నేరుగా పగిడిద్దరాజు ఆలయానికి వెళ్లారు. పసుపు, కుంకుమ భరిణెలపై ఎరుపు రంగు వస్త్రాన్ని కప్పి ఆలయంలో ఉంచి మొక్కులు సమర్పించారు. అనంతరం పూజారులు వెదురు కర్రలను తీసుకొచ్చి పగిడిద్దరాజు ప్రతిమను తయారు చేసి గద్దెపై ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో పగిడిద్దరాజు ఆలయం వద్ద పండుగ వాతావరణం నెలకొన్నది. తర్వాత వడ్డె జగ్గారావు పడిగెను పట్టుకొని బయల్దేగా, ఆయన వెంట పూజారులు, భక్తులు తరలివెళ్లారు. ఊరు దాటే వరకు మహిళలు నీళ్లారబోస్తూ 'వరుడిగా వెళ్లి.. మరువెళ్లికి రావయ్యా.. బాటసారులకు ఎలాంటి ఆపద రాకుండా తీసుకెళ్లవయ్యా..' అంటూ సాగనంపారు. సుమారు 70 కిలోమీటర్లు అటవీ మార్గంలో కాలినడన పయనించి మేడారం చేరుకోనున్నారు. మారమధ్యంలో కర్లపల్లి, లక్ష్మీపురంలోని పెనక సాంబయ్య ఇంటి వద్ద గద్దెపై పగిడిద్దరాజు ప్రతిమను ప్రతిష్ఠించి, వారి ఆతిథ్యం స్వీకరిస్తారు. తిరిగి బుధవారం ఉదయం 4 గంటలకు బయల్దేరి సాయంత్రం ఆరు వరకు మేడారం చేరుకుంటామని పూజారులు పెనక సురేందర్, రాజేశ్వర్, పురుషోత్తం తెలిపారు.


మేడారానికి అటవీమార్గంలో పగిడిద్దరాజు పడిగెతో తరలివెళ్తున్న భక్తులు, గ్రామస్తులు

# చంపేస్తే ఇంటికెళ్లిపోవచ్చని..!

### చిన్నారిని బైక్‌పై తీసుకెళ్లి.. కెనాల్‌లో నెట్టేసి హత్య చేసిన బాలుడు : డీసీపీ రవీందర్ వెల్లడి

పర్వతగిరి, ఫిబ్రవరి 20: సర్కస్ ఆడేందుకు వచ్చిన ఆరేళ్ల చిన్నారి సంధ్యను ఓ బాలుడు పథకం ప్రకారమే కెనాల్ నీటిలో నెట్టేసి హత్య చేసినట్లు తేలింది. పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ పీ రవీందర్ వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడుకు చెందిన బాలుడు అతడి అన్న చిన్న, వదిన శాంతి, వారి పిల్లలతో ఊరూరా తిరుగుతూ సర్కస్ ఆడేవాడు. వీరితో పాటు సమాని రవి, భార్య స్వప్న, పిల్లలు సంతోష, సంధ్య(మృతురాలు) కూడా సర్కస్ చేసేవారు. వీరందరూ ఇంటి నుంచి వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఇస్లావత్ తండాకు వచ్చి చాలా రోజులవుతోంది. దీంతో ఆ బాలుడు ఊరిపై బెంగ పెట్టుకొని ఇంటికి పోతానని అన్నను చాలాసార్లు అడుగగా మందలించాడు. అయినా అతడికి ఇంటి మీద ధ్యాస పోలేదు. ఇంటి వద్ద పెంచుకున్న పెంపుడు కుక్కలను కూడా చూడాలని అనిపించింది. ఈ నెల 18న ఉదయం రెండు కుటుంబాలు పర్వతగిరి మండలంలోని ఇస్లావత్ తండాకు సర్కస్ ఆడేందుకు వచ్చాయి. రెడ్లవాడకు వెళ్లే మార్గంలో ఉన్న చర్చికి ప్రార్థన చేసేందుకు బాలుడు వెళ్లాడు. అక్కడి కెనాల్‌లో నీళ్లు ప్రవహిస్తుండడం చూసి అతడు ఒక ఆలోచనకు వచ్చాడు. చిన్నారి సంధ్యను అందులో పడేస్తే.. అందరూ నీళ్లలో పడి చనిపోయిందని అనుకుంటారని, ఇంటికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేస్తారని, వాళ్లు వెళ్లిపోతే తాము కూడా కొద్దిరోజులు సర్కస్ ఆడకుండా ఇంటికి వెళ్లొచ్చని భావించాడు. అనంతరం ఇస్లావత్ తండాకు వచ్చాడు. వారు ఉన్నచోటుకు కొద్ది దూరంలో పాప ఆడుకుంటుండగా మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో బయటికి వెళ్లొస్తానని అన్నతో చెప్పి అతడి బైక్ తీసుకొని కొంత దూరం వెళ్లాడు. వెనక్కి వచ్చి కొద్దిదూరం నుంచి సంధ్యకు సైగ చేసి బైక్‌పై ఎక్కించుకొని కెనాల్ వద్దకు తీసుకెళ్లాడు. మెట్లు దిగుతూ పాపను వెనుక నుంచి నీళ్లలో తోసేయడంతో మునిగి చనిపోయింది. తిరిగి ఏమీ తెలియనట్లు సంధ్య కోసం తల్లిదండ్రులతో కలిసి వెతికసాగాడు. పోలీసుల దర్యాప్తులో కెనాల్ వద్దకు తీసుకెళ్లేందుకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పథకం ప్రకారమే చంపినట్లుగా బాలుడిపై హత్య కేసు నమోదు చేశారు. కేసు ఛేదించిన పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై వీరభద్రరావు, పోలీస్ సిబ్బందిని ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ పీ.రవీందర్

# చరిత్ర తెలిసేలా శిలాశాసనాలు

### మేడారం అభివృద్ధికి వంద ఎకరాల భూసేకరణ : మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ) : మేడారం జాతర అభివృద్ధికి వంద ఎకరాల భూసేకరణ చేయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటికే 50 ఎకరాలు పూర్తయిందని, మరో 50 ఎకరాల కోసం రైతులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. మంగళవారం మీడియా పాయింట్ వద్ద ఆమె విలేకరులతో మాట్లాడారు. చరిత్ర పరిశోధకులు సమ్మక్క-సారలమ్మల పూజారుల సహకారంతో తల్లుల వాస్తవ చరిత్ర ప్రపంచానికి తెలిసేలా శిలాశాసనాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆలయ శాశ్వత అభివృద్ధి కోసం ప్రత్యేక కమిటీని నియమిస్తామన్నారు. రద్దీ లేకుండా నేటి నుంచి భక్తులకు బంగారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారాన్ని జాతీయ పండుగగా గుర్తించేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. తల్లుల దర్శనానికి సీఎంతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, గవర్నర్ రానున్నారని చెప్పారు. అభివృద్ధి పనులను 2025 మినీ జాతర నాటికి పూర్తి చేయనున్నట్లు మంత్రి వివరించారు.

